క్లుప్తంగా...

అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోషం



అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్. సంతోషం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన చిట్టి బుర్ర బదిలీపై మెయిన్ పీసీఆర్‌కు వెళ్లగా, మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. సంతోషంను నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

‘సైబర్ సురక్షా’పై అవగాహన



సైబర్ సురక్షా కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ విద్యార్థులు

గోల్కొండ: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి శ్రీనివాసు అన్నారు. సైబర్ సొసైటీ ఆఫ్ ఇండియా జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వారు మంగళవారం సైబర్ సురక్షా ఫర్ రూరల్ పీపుల్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు మోసపోయే వారిలో అన్ని రకాల వయస్సు, ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నారని, అయితే గ్రామీణ ప్రాంత ప్రజలకు సైబర్ నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలన్న విషయంపై విద్యార్థులతో తాము అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు




బస్తీలో పర్యటించిన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని ఎస్ఆర్టీ కాలనీ, మదీనానగర్, జఫర్ రోడ్డు, వహేద్‌కాలనీ, ఇమ్లిబన్, ముర్తుజానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య విభాగాం సిబ్బందితో చెత్తను తొలగింపచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

స్పోర్ట్స్ కమిటీ సభ్యుల ఎన్నిక

అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప విద్యాశాఖాధికారి ముఖ్రం, సీసీ ముఖ ద్దర్, పీఈటీలు శ్రీనివాస్, మహేష్, తెలుగు పండితులు డాక్టర్ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను వెంటనే బాగు చేయాలి



శ్యాంరావు

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇప్పటికే శిథిలావస్థకు చేరిన రోడ్లలో జోరుగా కురుస్తున్న వర్షానికి గోతులు ఏర్పడ్డాయన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

అన్నదానం

గౌలిపురా: మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఎ.మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేసే ఉద్యోగుల చిరకాల కోరికను నిజం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని హైదరాబాద్ డిపో–1 మేనేజర్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం డిపో1లో ఉద్యోగులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు.

ఎంజీబీఎస్‌లో...

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం 43 వేల మంది శ్రమకు దక్కిన గౌరవం అని ఎంజీబీఎస్ కస్టమర్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సిబ్బందితో కలిసి ఎంజీబీఎస్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఎంజేమార్కెట్‌లో..

అబిడ్స్: ఎంజేమార్కెట్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో సీఎంకేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో 43 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలిచిన సీఎం కేసీఆర్ అని నందకిశోర్ వ్యాస్ పేర్కొన్నారు. జాంబాగ్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ధన్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు శీలం సరస్వతి, అనిత, పప్పు మాత్రే, ఆనంద్‌సింగ్, కోటి శైలేష్‌కురుమ, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులతో..

ఆర్టీసీ ఉద్యోగులతో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ సంబరాలు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులందరిని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడంతో ఆశీష్‌కుమార్ యాదవ్ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మిఠాయిలు తినిపించి సంబరాలు నిర్వహించారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: పాతబస్తీకి మెట్రోరైలు కొనసాగించడంతో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ కేబినేట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గంలో మిఠాయిలు తినిపించుకొని సంబురాలు జరుపుకున్నారు. జమ్మిచెట్టు రాజు, నరేష్‌కుమార్, శోభారెడ్డి, రాజలింగం, లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మిధాని డిపోలో..



మిఠాయిలు తినిపిస్తున్న ఆశీష్‌కుమార్ యాదవ్

సంతోష్‌నగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల మిధాని ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. డిపో మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ..కార్మికులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించడం సంతోషకరమన్నారు. స్వామి గౌడ్, వెంకటయ్యగౌడ్, ఎండీ మజీద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంజీబీఎస్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన ఉద్యోగులు



లలితాబాగ్‌లో మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు



మిధాని డిపోలో పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

కార్వాన్ నియోజకవర్గంలో బల్దియా కమిషనర్ పర్యటన



శాతం చెరువును పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రొనాల్డ్ రోస్, ఎమ్మెల్యే తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లతో పాటు చెరువు, నాలాలకు వెంటనే మరమ్మతులు చేయిస్తామని బల్దియా కమిషనర్ రొనాల్డ్ రోస్ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యేతో కలిసి కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఆయన నదీమ్ కాలనీకి ప్రతిఏటా ముంపునకు గురి చేస్తున్న శాతం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ శాతం చెరువుకు జరుగుతున్న తూము ఆధునీకీకరణను చూపించారు. టోలిచౌకి, రియాసత్ నగర్ తదితర ప్రాంతాలు కూడా ముంపునకు గురవుతున్నాయని టోలిచౌకి రుమాన్ హోటల్‌తో పాటు ఆ ప్రాంతంలోని ఎన్నో షాపుల్లో వరదనీరు చొచ్చుకుని వస్తుందని ఆయన అన్నారు. అనంతరం ఆయన అహ్మద్ కాలనీలోని నాలాను పరిశీలించారు. ఈ నాలా పై స్లాబ్ లేకపోవడం వల్ల స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన కమిషనర్ దృష్టికి తెచ్చారు. నాలా వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల నిర్వహణ అధ్వానంగా ఉందని ఆయన అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ వెంకటేష్, కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్ తదితరులున్నారు.

దళిత కులాల సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొస్తాం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరిశంకర్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అట్టడుగు స్థాయిలో ఉన్న దళితులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరి గౌరి శంకర్ అన్నారు. అత్యంత వెనుకబడిన దళిత కులాల సాహిత్య చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం రవీంద్రభారతిలో మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో దళిత విప్లవకారుడు అన్నా బావు సాఠె 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత విప్లవకారుడైన అన్నా బావు సాఠె సొంత గ్రామానికి సీఎం కేసీఆర్ ఆయన ఉత్సవాలను జరిపారని గుర్తుచేశారు. ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరు వెంకటేష్ మాట్లాడుతూ..మాంగ్ సమాజ్ కులస్తుల కోసం సంక్షేమ భవనాని ఏర్పాటు చేయాలని, స్థానిక ఎమ్మార్వో ఆఫీసులలో కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దళిత విప్లవకారుడు అన్నా బావు సాఠె చరిత్ర బ్రోచర్లను ఆవిష్కరించారు. సాహిత్య అకాడమి కార్యదర్శి బాలచారి, ప్రముఖ అంబేద్కర్‌వాది జేబీరాజు, సీనియర్ జర్నలిస్టు ఎం.స్వామి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తులసిదాస్ గైక్వాడ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సంతోష్‌నగర్: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా నడుచుకోవాలని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ సూచించారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 20 మంది రౌడీషీటర్లకు మంగళవారం ఆయన స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర, డీఐ గోపాల్, ఎస్సై నర్సింగ్ రావు, సిబ్బంది పాల్గొన్నారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 14 మంది రౌడీషీటర్లకు మంగళవారం కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు తమ నేర ప్రవృత్తిని మానుకొని సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు.



ప్రత్యేక పూజలు



గౌలిపురా: మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.ఎస్.ఆనంద్ రావు, బొడ్డు సాయిబాబా, మధుసూదన్ గిరి, బి.వై.శ్రీకాంత్, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, డల్లు శివ, దేవేందర్, రిషికేశ్ తదితరులు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం



వేడుకల్లో డాక్టర్ సునీల్ కోఠావర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కిరణ్‌కుమార్

అబిడ్స్: నోటి పరిశుభ్రతతో మనిషి ఆరోగ్యకర జీవితం పొందుతాడని ఏఐఏడీ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ సునీల్ కోఠావర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు నోటి పరిశుభ్రత, దంత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జాతీయ ఓరల్ హైజిన్ డే సందర్భంగా అబిడ్స్‌లోని ఏరియా డెంటల్ చారిటబుల్ ఆసుపత్రిలో నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ సునీల్ కోఠావర్ మాట్లాడుతూ.. చెడు మౌఖిక పరిశుభ్రతతో మధుమేహం, కార్డియాక్ స్ట్రోక్ లాంటి ప్రమాదకర రోగాలు సంభవిస్తాయన్నారు. డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ప్రీతి, డాక్టర్ శ్వేత, ఎస్‌కే. భాష, అబ్బాస్, షేక్ ముజమిల్ పాల్గొన్నారు.

రంజీ క్రికెట్ మ్యాచ్ ఆడిస్తానని మోసం

నిందితుడి అరెస్ట్

దూద్‌బౌలి: రంజీ క్రికెట్ మ్యాచ్‌లో ఆడిస్తానంటూ డబ్బులు వసూలు చేసి తప్పించుకొని తిరుగుతున్న ఓ వ్యక్తిని చార్మినార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం.. చార్మినార్ క్రికెట్ క్లబ్ పేరుతో ఓ వ్యక్తి కొంతకాలంగా క్రికెట్‌పై మోజున్న యువకులను క్రికెట్ మ్యాచ్‌ల్లో అవకాశం కల్పిస్తానంటూ మోసం చేశాడు. దీంతో చాలా మంది యువ క్రికెటర్లు చార్మినార్ క్రికెట్ క్లబ్ నిర్వాహకులను ఆశ్రయించారు. చార్మినార్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడిని రంజీ మ్యాచ్‌లో ఓపెనర్‌గా అవకాశం కల్పిస్తానని డబ్బులు వసూలు చేసి చివరకు అతడిని నాలుగవ స్థానంలో ఆడిచాడు. చివరికి ఆ మ్యాచ్ రంజీ మ్యాచ్ కాకుండా ఎక్కడో నామమాత్రపు మ్యాచ్ కావడంతో గమనించిన యువకుడు డబ్బులు తీసుకున్న వ్యక్తి రూ.లక్ష రూపాయలు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో యజమాని ఆ డబ్బు మ్యాచ్ ఆడించడానికి ఫీజుగా చెల్లించారని చెప్పడంతో బాధితుడు మోసపోయినట్లు గ్రహించి చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

న్యూసెన్స్ కేసులో వ్యక్తి 3 రోజుల జైలు

డబీర్‌పురా: ఆస్పత్రి వద్ద న్యూసెన్స్ చేస్తున్న కేసులో ఓ వ్యక్తికి మంగళవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముస్లిం మెటర్నిటీ ఆస్పత్రి వద్ద గతనెల 23న రాత్రి 10 గంటల సమయంలో ఆర్బాబ్ షరీఫ్ (25) అనే వ్యక్తి న్యూసెన్స్ సృష్టిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని షరీఫ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా.. పోలీసులతో సైతం దురుసుగా ప్రవర్తించాడు. పోలీసులు షరీఫ్‌పై ఈ–పెట్టీ కేసులు నమోదు చేశారు. అనంతరం షరీఫ్‌ను పోలీసులు మంగళవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా.. మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు షరీఫ్‌కు 3 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సట్టా నిర్వాహకుడికి జైలు, జరిమానా



అబిడ్స్: సట్టా నిర్వహిస్తున్న స్థావరంపై మంగళ్‌హాట్ పోలీసులు దాడిచేసి కీలకమైన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ప్రకాష్ థియేటర్ సమీపంలో స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని సట్టా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం అర్ధరాత్రి పోలీసులు దాడిచేశారు. ఈ సందర్భంగా సట్టా నిర్వాహకుడు గోడేకి ఖబర్ నివాసి దిలీప్(38) ను అరెస్టు చేసి సట్టా నిర్వహణకు ఉపయోగించే వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం ఉదయం నాంపల్లి కోర్టులో హాజరుపరచగా మూడు రోజుల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

స్లాటర్ హౌస్ నిర్మాణానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌కు వినతిపత్రం అందజేసిన ఆరె కటిక సంఘం ప్రతినిధులు

జియాగూడ: స్లాటర్ హౌస్‌ను ఆధునీకరించి నిరుపేదలకు ఉపాధి కలిగే విధంగా కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ ఆరె కటిక సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, చర్మకష్ సంఘం అధ్యక్షుడు శశికాంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దర్శన్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా జియాగూడ కమేళాపై వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. మేకల మండిని ఆధునీకరించకపోవడం వల్ల నానాటికీ సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఇతర మండీలను ఆధునీకరించనట్లే జియాగూడ మేకల మండిని ఆధునీకరించి దీనిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏకే ట్రస్ట్ చైర్మన్ దివాకర్‌లాల్, ప్రధాన కార్యదర్శి గురుదాస్, సంఘం ప్రతినిధులు హరికిషన్, సాయి, రాఘవేందర్, నరేందర్, హరిలాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల కలకపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ మజహర్ ఉల్లా, డాక్టర్ కవిత తదితరులు

గోల్కొండ: వేగంగా వ్యాపిస్తున్న కళ్ల కలకపై మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో కళ్ల కలకపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళ్ల కలకతో బాధపడుతున్న వారు, ఆస్పత్రికి వచ్చిన ఔట్ పేషెంట్లకు కళ్ల కలక వ్యాధిపై అవగాహన కల్పించడానికి ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ కవిత కళ్ల కలక, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై మాట్లాడారు. వ్యాధి సోకిన వారు ఎవరికీ షేక్ హ్యాండ్ ఇవ్వడం కానీ, ముట్టుకోవడం కానీ చేయకూడదన్నారు. ముఖ్యంగా ఇది పిల్లలకు వేగంగా వ్యాపిస్తుందని, కళ్ల కలక సోకిన వారు పిల్లలకు దూరంగా ఉండాలన్నారు. వ్యాధి తగ్గుముఖం పట్టే వరకు నల్లటి అద్దాలు ధరిస్తూ కంటిని తుడవడానికి శుభ్రమైన టిష్యూ పేపర్, బట్టను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ మహ్మద్ రవూఫ్, ఏఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ తస్నీమ్ మెహర్ తదితరులున్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గోల్కొండ: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. మంగళవారం ఆయన జలమండలి అధికారులతో గుడిమల్కాపూర్ డివిజన్‌లోని శివాజీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న డ్రైనేజీలను జలమండలి అధికారులకు చూపించారు. ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ సోనిత్ మాట్లాడుతూ..ఇప్పటికే డివిజన్‌లో జలమండలి మాన్‌సూన్ స్పెషల్ స్క్వాడ్‌లు సహాయక చర్యలు చేపట్టాయని అన్నారు. అన్ని ప్రాంతాల్లో ఆ బృందాలు పర్యటించి దెబ్బతిన్న డ్రైనేజీలకు మరమ్మతులు చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వామి, ప్రసాద్, మహేష్, బాలకృష్ణ తదితరులున్నారు.



విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్త పడాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాంద్రాయణగుట్ట: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విషజ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు అన్నారు. ఫలక్‌నుమాలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం దోమలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో నీరు నిల్వకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఎం.సతీష్ రెడ్డి, సూపర్‌వైజర్ పి.అరుణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ జావెద్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను తెలుపుతూ చిన్నారులలో దేశభక్తి భావాన్ని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆల్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, శ్రీ లక్ష్మీనరసింహాస్వామి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమి, ఆదిలీల ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మనదేశ గీతం, మన దేశ సంస్కృతి నృత్యం పేరిట సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సకల కళలతో కూడి సమ్మేళనాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీనటులు రామ్‌లక్ష్మణ్, ఆదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ, సంస్థ అధ్యక్షురాలు అపర్ణ దీపికా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం సమర్పిస్తున్న ఉపేంద్ర శర్మ

సుల్తాన్‌బజార్: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ చట్టం ప్రకారం జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ కోరారు. ఈ మేరకు మంగళవారం దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ..రాష్ట్రంలోని ప్రధాన ఆలయం పేదల దేవుడైన వేములవాడ రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న జాయింట్ కమిషనర్ క్యాడర్ అయిన ఆలయానికి రెవెన్యూ డివిజన్ అధికారి అందులోనూ ఆలయాల గురించిన అనుభవం గానీ దేవాదాయ శాఖ చట్టం గురించి గానీ ఏమాత్రం అవగాహన లేదని ఆరోపించారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని తెలంగాణ నీటిపారుదల శాఖ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీవాగ్దేవి ఘంటసాల సాంస్కృతిక విభావరి ఆధ్వర్యంలో భక్తానంద ఉదయ చంద్రచే భక్తి, లలిత, యుగళ విశాద గీతా విభావరిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలపించిన పలు గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ నగర వైస్ చైర్మన్ డాక్టర్ ఎల్.నిర్మల, అఖిల భారత ఆలయాల అధ్యక్షులు రామరాజు, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు పి.బడే సాబ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో నిర్మల తదితరులు

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి



చార్మినార్: విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ సోహేల్ అన్నారు. సర్కిల్–6 పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని కమర్షియల్ విద్యుత్ బిల్లుల బకాయి చెల్లింపుల్లో భాగంగా మంగళవారం చంచల్‌గూడ ఏఈ సోహేల్, లైన్‌మెన్ రహీంలకు 2–బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పిల్లి గుడిసెలు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్, ఉపాధ్యక్షుడు పిల్లి గణేష్ తదితరులు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ సోహేల్ మాట్లాడుతూ... తాము వినియోగించుకున్న విద్యుత్ నెలనెలా సకాలంలో బిల్లులు చెల్లిస్తే ఆర్థిక సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.